క్లుప్తంగా

అభ్యర్థుల రికార్డులు పరిశీలన


సమావేశంలో పరిశీలకుడు వెంకాదేశ్ బాబు

సిద్దిపేటజోన్/హుస్నాబాద్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం సిద్దిపేట సెగ్మెంట్ పరిధిలోని అభ్యర్థుల వ్యయ రికార్డులు స్వీకరించారు. ఈసందర్భంగా ఎన్నికల వ్యయ పరిశీలకుడు వెంకాదేశ్ బాబు, రిటర్నింగ్ అధికారి రమేశ్ బాబు వాటిని పరిశీలించారు. కాగా డిసెంబర్ 28న వ్యయ లెక్కల గురించి కలెక్టరేట్‌లో సమావేశం జరగనుందని అధికారులు పేర్కొన్నారు. హుస్నాబాద్‌లోనూ.. సిద్దిపేట వ్యయ పరిశీలకులు వెంకటేశ్ బాబు, రిటర్నింగ్ అధికారి బెన్ షాలోమ్ కూడా అభ్యర్థుల వ్యయ వివరాలు పరిశీలించారు. ఎన్నికల బరిలో ఉన్న 19 మంది అభ్యర్థులు వారి ఖర్చులు, వ్యయ వివరాలు అందజేశారు.

ముదిరాజ్‌ల మద్దతు కేసీఆర్‌కే..

కొండపాక(గజ్వేల్): సీఎం కేసీఆర్‌కే మా మద్దతు అంటూ కొండపాక 200 ముదిరాజ్ కుటుంబాలు ఏకగ్రీవ తీర్మాన ప్రతిని సంఘం అధ్యక్షుడు గణపురం మల్లేశం డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డికి అందజేశారు. సోమవారం పెద్దమ్మ తల్లి దేవాలయం వద్ద సంఘం సభ్యులు సమావేశం నిర్వహించారు. అనంతరం దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు అందేలా చూడటం బీఆర్ఎస్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో జాగృతి రాష్ట్ర కార్యదర్శి అనంతుల ప్రశాంత్, సర్పంచ్ మాధురిరెడ్డి, నాయకులు మంచాల కనకరాంలు, ఆరుట్ల కనకయ్య, మహిపాల్‌రెడ్డి, రేపాక స్వామి, నల్ల యాదగిరి, నర్సింలు ముదిరాజ్ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అలాగే కొండపాక, క్రాంతి నగర్, వడ్డెర కాలనీల్లో బీఆర్ఎస్‌కు మద్దతుగా జాగృతి రాష్ట్ర కార్యదర్శి అనంతుల ప్రశాంత్ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

'విద్యను నిర్లక్ష్యం చేశారు'

సిద్దిపేటకమాన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యను నిర్లక్ష్యం చేసిందని తెలంగాణ పీపుల్స్ జేఏసీ కన్వీనర్ వెంకట్ నారాయణ అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పోరాటాల ద్వారా సాధించుకున్న తెలంగాణ నిరంకుశ పాలనలో ఉందన్నారు. రాహుల్ గాంధీ రాష్ట్రానికి వచ్చినప్పుడు ఆయనను కలిసి మూడు ముఖ్య సమస్యలపై చర్చించామన్నారు. ఈసందర్భంగా కరపత్రాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో ప్రొఫెసర్ వీరన్న, రవిచంద్ర, సత్తయ్య, శ్రీనివాస్, రవీందర్, తిరుపతి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

చేర్యాల(సిద్దిపేట)/సిద్దిపేటకమాన్: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సీఐ సత్యనారాయణరెడ్డి అన్నారు. మండల పరిధిలోని కడవేర్గు, పోతిరెడ్డిపల్లి, పెద్దరాజుపేట గ్రామాల్లో సోమవారం చేర్యాల ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డితో పాటు కేంద్ర బలగాల అధికారులు, పోలీసు సిబ్బందితో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. అలాగే సిద్దిపేట వన్ టౌన్ సీఐ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు.

మీరే మా బలం.. బలగం


నారాయణరావుపేటలో శ్రీనితకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

మంత్రి హరీశ్‌రావు సతీమణి శ్రీనిత

సిద్దిపేటరూరల్: మా బలం, బలగం సిద్దిపేట ప్రజలేనని మంత్రి హరీశ్‌రావు సతీమణి శ్రీనిత అన్నారు. సోమవారం నారాయణరావుపేట మండల పరిధిలోని జక్కాపూర్, గుర్రాలగొంది, గోపులాపూర్, మటిండ్ల, మల్యాల గ్రామాల్లో హరీశ్‌రావుకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మీ ఆదరణ, ఆప్యాయత ప్రేమను మా హృదయాల్లో పెట్టుకుంటామన్నారు. అభివృద్ధిలో సిద్దిపేట దేశానికే ఆదర్శంగా మారుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలకృష్ణ, సర్పంచ్‌లు శశి, ఆంజనేయులు, వజ్రవ్వ, రుక్కవ్వ, వైస్ ఎంపీపీ సంతోష్, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పుల్లూరు స్వయంభూ లక్ష్మీ నరసింహా స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సిద్దిపేటజోన్: పట్టణంలోని పలు వార్డుల్లో సోమవారం మంత్రి హరీశ్‌రావు సతీమణి శ్రీనిత ప్రచారం నిర్వహించారు. ఆమె వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్, ఆయా వార్డ్ కౌన్సిలర్లు మల్లికార్జున్, సురేష్, శ్రీదేవి, శ్రీనివాస్ యాదవ్, మహేందర్, తదితరులు ఉన్నారు.

బీజేపీకి అవకాశం ఇవ్వండి

- పార్టీ అభ్యర్థి దశమంతరెడ్డి


జనగామ: ప్రచారం చేస్తున్న దశమంతరెడ్డి

జనగామ: జనగామ నియోజకవర్గం సంపూర్ణ అభివృద్ధి సాధించేలా ఈసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ అభ్యర్థి ఆరుట్ల దశమంతరెడ్డి కోరారు. పట్టణంలోని 16, 17వ వార్డుల్లో పట్టణ యూత్ నాయకుడు సంపత్ ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దశమంతరెడ్డి మాట్లాడారు. స్థానికుడిగా తనను నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించాలని కాంక్షించారు. చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా చేయించడంలో ప్రధాన పాత్ర పోషిస్తానని చెప్పారు. జనగామలోని 30 వార్డుల్లో మౌలిక వసతుల కల్పన కోసం చొరవ తీసుకుంటానని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రిలో సిటీ స్కాన్ సేవలను అందుబటులోకి తీసుకొచ్చి పేదల ఆర్థిక భారాన్ని తగ్గిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. క్వింటా ధాన్యానికి రూ.3100లు మద్దతు ధర ఇచ్చిన ఘనత బీజేపీకే దక్కుతుందని తెలిపారు.

బీజేపీతోనే అభివృద్ధి, సంక్షేమం

మద్దూరు(హుస్నాబాద్): బీజేపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని ఆ పార్టీ జనగామ అభ్యర్థి ఆరుట్ల దశమంతరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. సీఎం కేసీఆర్ కొత్త రేషన్‌కార్డులు, నిరుద్యోగ భృతి ఇవ్వలేదని మండిపడ్డారు. పేదల సొంతింటి కల నెరవేర్చలేదన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మోకు ఉదయ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

24 గంటలు అందుబాటులో ఉంటా..

- హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్


అఫిడవిట్‌ను చూపుతున్న పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్‌రూరల్: కాంగ్రెస్ గెలిచిన తర్వాత హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలకు ఆరు గ్యారంటీలను అమలు చేస్తానని.. ఎలాంటి అవినీతి చేయనని, 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటానని హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ ప్రజలకు అఫిడవిట్ విడుదల చేశారు. సోమవారం పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసిన అనంతరం మేనిఫెస్టో విడుదల చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో విసిగిపోయిన ప్రజలు మార్పు కోరుతున్నారని అన్నారు. జిల్లాకు కేంద్రీయ విద్యాలయం, పాస్‌పోర్టు కేంద్రం ఏర్పాటుకు కృషి చేశానన్నారు. రైతాంగానికి తోటపల్లి రిజర్వాయర్ ద్వారా చిగురుమామిడి, సైదాపూర్ మండలాలకు, దేవాదుల ద్వారా ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాలకు సాగు నీరు అందిస్తానని హామీ ఇచ్చారు. గౌరవెల్లి ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలను పూర్తి చేసి హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువుకు సాగు నీరు వచ్చే విధంగా అనుసంధానం చేస్తానన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, ఏఐసీసీ కార్యదర్శి క్రిస్టోఫర్ తిలక్, అసెంబ్లీ పరిశీలకులు గోపీనాథ్, కేడం లింగమూర్తి, చిత్తారి రవీందర్, వైస్ ఎంపీపీ దేవసాని నిర్మల నర్సింహారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కర్ర రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి ప్రభుత్వాలను ఓడించాలి

హుస్నాబాద్: ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీఆర్ఎస్, బీజేపీలను ఓడించాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. పొన్నం ప్రభాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి తూముల సదానందం, రాష్ట్ర కార్యదర్శి తొండూరి ఎల్లయ్య, నాయకులు తాళ్లపల్లి ఎల్లయ్య, చుంచు రమేష్, వెంకట్రాజం, జాల రవి తదితరులు పాల్గొన్నారు.

రఘునందన్‌ను చిత్తుగా ఓడించండి

- ఎన్ని కుట్రలు చేసినా నా గెలుపును ఆపలేరు
- దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి


రాయపోల్: మాట్లాడుతున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: మాటలు కోటలు తప్ప చేతల్లో చూపని రఘునందన్‌రావును ప్రజలు చిత్తుగా ఓడించి తగిన గుణపాఠం చెప్పాలని దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపఎన్నికల సమయంలో ఎన్నో హామీలిచ్చి గెలిచిన రఘునందన్‌రావు అందులో ఒక్కటన్నా నెరవేర్చాడా? అని ప్రశ్నించారు. గెలిచే దమ్ములేక సీఎం కేసీఆర్‌పై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అమలు అవుతున్నాయా? ప్రజలు ఆలోచించాలని కోరారు. రాజకీయంగా ఎదుర్కోలేకనే తనపై కుట్ర పన్ని దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఎవరెన్ని కుట్రలు చేసినా దుబ్బాక ప్రజల ఆశీర్వాదంతో భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ యాదగిరి, ఏఎంసీ చైర్మన్ ఇప్పలక్ష్మీ, వెంకటేశ్వర శర్మ, సర్పంచ్‌లు నర్మిల, మౌనిక రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మా నాన్నని ఆశీర్వదించండి..

మిరుదొడ్డి(దుబ్బాక): దుబ్బాక గడ్డపై గులాబీ జెండా ఎగిరి అభివృద్ధి పథాన నిలవాలంటే కొత్త ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని ఆయన కుమారుడు కొత్త పృథ్వీ కృష్ణారెడ్డి కోరారు. మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్‌తో కలిసి సోమవారం మండల పరిధిలోని చెప్యాల, మల్లుపల్లి, అల్వాల, అందె, కొండాపూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కత్తిపోటుకు గురైన తన తండ్రి ప్రజా ఆశీర్వాదంతో ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడని తెలిపారు. దుబ్బాక మరింత అభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్ అధికారంలోకి రావాలన్నారు. గ్యారంటీ స్కీంలతో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకుల మాటలను నమ్మొద్దన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే సీఎం కేసీఆర్ మూడోసారి సీఎం కావాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ అన్నారు. కార్యక్రమంలో దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ నమిలె భాస్కరాచారి, వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, సర్పంచ్‌లు పెద్ది కవిత, ఎనగంటి కిష్టయ్య, మాచపురం లక్ష్మీయాదగిరి, చుక్క శంకర్, భారతి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తోట కమలాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ వల్లాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బుడగ జంగాల సంఘం మద్దతు..


అల్వాలలో మాట్లాడుతున్న పృథ్వీ కృష్ణారెడ్డి

దుబ్బాకరూరల్: బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్దతు తెలుపుతూ మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన బుడగ జంగాల సంఘం సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. తీర్మాన పత్రాన్ని జెడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి, యెల్లు రవీందర్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో మంజుల బాల్‌నర్సుగౌడ్, రాజాలక్ష్మణ్‌రావు, శ్రీనివాస్‌మాదిగ, శివరాజ్ మాదిగ, రాజు, కరుణాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ ఘనత కాంగ్రెస్‌దే..


బాండ్ పేపర్‌పై సంతకం చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి


మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

- దుబ్బాక కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాకరూరల్: ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని రాజక్కపేట, బల్వంతాపూర్, నర్లెంగడ్డ, పద్మశాలిగడ్డ, అప్పనపల్లి, చెల్లాపూర్, మల్లాయిపల్లి, దుంపలపల్లి, ఆకారం, చేర్వాపూర్, ధర్మాజీపేటలో కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు రుణమాఫీ ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. రుణమాఫీ చేయడంలో సీఎం కేసీఆర్ విఫలమయ్యారని మండిపడ్డారు. ఇంటికో ఉద్యోగం ఇస్తానని చెప్పి ఇంతవరకు ఒక్క ఉద్యోగం ఇవ్వలేదన్నారు. నిరుద్యోగులు నేడు రోడ్ల మీద తిరుగుతుంటే ఆవేదన కలుగుతోందన్నారు. దళిత బంధు, బీసీ బంధు పథకాల పేరుతో దళితుల్లో చిచ్చుపెట్టాడని ఆరోపించారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు విచ్చలవిడిగా వెలిశాయన్నారు. మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి హయాంలోనే నియోజకర్గం అభివృద్ధి జరిగిందన్నారు. రెండుసార్లు గెలిచిన ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి నియోజకవర్గాన్ని ఏమి అభివృద్ధి చేశాడని ప్రశ్నించారు. నియోజకవర్గ సమస్యలపై తాను ప్రశ్నిస్తున్నానని గొప్పలు చెప్పుకోవడం తప్ప ఎమ్మెల్యే రఘునందన్‌రావు చేసిందేమి లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ. 2 లక్షల వరకు రుణమాఫీతో పాటు ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని పేర్కొన్నారు.

బాండ్ పేపర్‌పై సంతకం..

మండలంలోని రేకులకుంట మల్లికార్జునస్వామి దేవాలయం, చెల్లాపూర్‌లోనిసోమేశ్వరస్వామి దేవాలయంలో కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ అధికారంలోకి రాగానే మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ప్రమాణం చేసి రూ. 100 బాండ్ పేపర్‌పై సంతకం చేశారు.

అందరివాడు కేసీఆర్


జనగామ: ఆర్యవైశ్య సంఘం ఆత్మీయ సమ్మేళనంలో పల్లా


జనగామ: పద్మశాలీల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న పల్లా

- మూడోసారి ఆశీర్వదించండి
- బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ: ప్రత్యేక రాష్ట్రంలో అన్ని కులాలు, మతాలకు సమప్రాధాన్యతను ఇస్తూ దేశంలోనే తెలంగాణకు ప్రత్యేకత తీసుకొచ్చిన అందరివాడు కేసీఆర్‌ను మూడోసారి సీఎంగా ఆశీర్వదించాలని బీఆర్ఎస్ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోరారు. జనగామ పట్టణంలో సోమవారం వివిధ ఫంక్షన్ హాళ్లలో నిర్వహించిన ఆర్యవైశ్య, మున్నూరుకాపు, పిట్టల సంఘం, హమాలీ వర్కర్లు, పద్మశాలీ, దళిత కమ్యూనిటీ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో సంక్షేమం, అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే బీఆర్ఎస్ కారుగ గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రం శామీర్‌పేట ఉషోదయ ఫంక్షన్ హాల్‌లో కాలియా చిట్టిబాబు ఆధ్వర్యంలో జరిగిన నక్కపిట్టల సంఘం కులస్తుల సమ్మేళనంలో పల్లా మాట్లాడారు. సంచార జాతికి చెందిన పిట్టల సంఘం తనకు మద్దతు తెలుపడం సంతోషంగా ఉందన్నారు. అన్ని గ్రామాలు తిరిగి సమస్యలు ఒంటబట్టించుకున్నా, గెలిచిన తర్వాత వచ్చే నెల నుంచి ఒకొక్కటిగా పరిష్కరిస్తామన్నారు. రాజకీయంగా ఆర్యవైశ్యులకు అధిక ప్రాధాన్యం కల్పిస్తున్న పార్టీ బీఆర్ఎస్ ఒక్కటే అని పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. జనగామ సూర్యపేట రోడ్డులోని భ్రమరాంబ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన ఆర్యవైశ్య సమ్మేళనంలో టూరిజం మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఆర్యవైశ్య మిత్రుల్లో కూడా పేదవారు ఉన్నారని, ఆ కుటుంబాలకు ఎటువంటి సహాయం అవసరం ఉన్నా తమ వద్దకు నేరుగా రావచ్చన్నారు. విద్య, ఉపాధి కోసం ఫ్యాక్టరీలు తీసుకు వచ్చే విధంగా ప్రయత్నం చేస్తూ ఆర్యవైశ్యలకు ఆర్థిక భరోసా కల్పించేలా చూస్తామని తెలిపారు. శ్రీనివాస్ మాట్లాడుతూ నీతి, నిజాయితీకి కేరాఫ్ అడ్రస్ వాసవీమాత బిడ్డలు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటారన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, సంఘ ప్రతినిధులు పజ్జూరి గోపయ్య, జైన రమేష్, బిజ్జాల నవీన్‌గుప్తా, గట్టు వెంకటేశ్వర్లు, పోకల శివుడు, గంగిశెట్టి ప్రమోద్ కుమార్, గందె వేణు, పిన్నా ఉపేందర్, కొత్తపల్లి కాశీపతి, మాశెట్టి వెంకన్న తదితరులు ఉన్నారు. ఉషోదయ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన పద్మశాలీల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పద్మశాలీల సంక్షేమానికి కృషి చేస్తున్న ప్రభుత్వానికి అండగా నిలువాలని పిలుపునిచ్చారు. పద్మశాలీ కులస్తులు మరింత ఆర్థికాభివృద్ధి సాధించేలా ప్రత్యేక ఫోకస్ సారిస్తామన్నారు. పద్మశాలీల ఆత్మగౌరవం కోసం భవనం నిర్మాణం చేపట్టేందుకు ఎకరం భూమితో పాటు రూ.1 కోటి నిధులు మంజూరు చేసి త్వరలోనే పనులు పూర్తిచేసి అప్పగిస్తామని పేర్కొన్నారు. నేతన్నల కోసం పనిచేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వడ్లకొండ ఎస్ఆర్ గార్డెన్‌లో ఆకుల సతీష్ ఆధ్వర్యంలో జరిగిన మున్నూరుకాపు ఆత్మీయ సమ్మేళనంలో మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్యతో కలిసి పల్లా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సారి జరుగుతున్న ఎన్నికల్లో మూడో సారి కేసీఆర్‌ను ఆశీర్వదించాలని, మూన్నూరు కాపు బంధువులకు అండగా ఉంటామన్నారు. విజయఫంక్షన్ హాల్లో జరిగిన ప్రైవేట్ టీచర్ల ఆత్మీయ సమ్మేళనంలో రాజేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొనగా, టీపీటీఎఫ్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు షేక్ షబ్బీర్ అలీ, ఉపాధ్యక్షుడు శివరాజ్, జిల్లా అధ్యక్షులు ఎండి అన్వర్, సంఘ ప్రతినిధులు బీఆర్ఎస్‌కు వారు సంపూర్ణ మద్దతు పలికారు.

వడ్డెరలు అన్ని రంగాల్లో రాణించాలి

బచ్చన్నపేట: మారుతున్న కాలానికి అనుగుణంగా వడ్డెరలు అన్ని రంగాల్లో రాణించేందుకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీనిధి గార్డెన్‌లో వడ్డెర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శివరాత్రి రాజనర్సయ్య అధ్యక్షతన నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పల్లా పాల్గొని మాట్లాడారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి అయిలుమల్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎత్తరి గణేష్, జిల్లా అధ్యక్షుడు శివరాత్రి రాజు, మండల అధ్యక్షుడు శివరాత్రి రాజు పాల్గొన్నారు.

పల్లా గెలుపు పక్కా..

నర్మెట: ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని, పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపు పక్కా అని పీఏసీఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర నాయకుడు ఇమ్మడి శ్రీనివాస్ రెడ్డి, పార్టీ అధ్యక్షుడు చింతకింది సురేష్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ గౌస్, ఉమ్మడి మండలాల కన్వీనర్ పెద్ది రాజిరెడ్డి అన్నారు.

బీఆర్ఎస్‌కే మా మద్దతు

చేర్యాల(సిద్దిపేట): పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మద్దతు ప్రకటిస్తున్నట్లు బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు తెలిపారు. పట్టణ శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో బీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శి ముస్త్యాల గణేష్ అధ్యక్షతన కార్మికుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన పదేళ్ల పాలనలో కేసీఆర్ సర్కారు కార్మికుల సంక్షేమానికి ఎంతో కృషి చేసిందన్నారు. సమావేశానికి పల్లా రాజేశ్వర్‌రెడ్డి సతీమణి నీలిమ హాజరై పల్లా గెలుపుకు కృషి చేయాలని కోరారు. మూడు మండలాల అధ్యక్ష కార్యదర్శులు రాజు, మల్లేశం, మల్లారం బాబు, బాబు, మధు, సలీం, నర్సింహులు, సుభాని, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆగమే..


మాట్లాడుతున్న సతీశ్‌కుమార్


నాయకులు బహూకరించిన నాగలితో సతీశ్‌కుమార్

- హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్

కోహెడరూరల్(హుస్నాబాద్): మూడోసారి భారీ మెజార్టీతో గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని శనిగరంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వరాష్ట్రంలో ఎంతో అభివృద్ధి జరిగిందని.. అన్నివర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేశారని కొనియాడారు. ఉద్యమ సమయంలో బీజేపీ, కాంగ్రెస్‌లు హేళన చేశాయన్నారు. వారి మాటలు నమ్మి ఓట్లు వేస్తే రాష్ట్రం అభివృద్ధికి దూరం అవుతుందని పేర్కొన్నారు. శిథిలావస్థలో ఉన్న శనిగరం ప్రాజెక్టును పునరుద్ధరించి కోహెడ, బెజ్జంకి మండలాలకు సాగు నీరు అందించామని తెలిపారు. తెలంగాణలో ఎవరు ఎన్ని కుట్రలు చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కొక్కుల కీర్తి, జెడ్పీటీసీ నాగరాజు, శ్యామల మధుసూదన్, రాష్ట్ర నాయకులు శ్రీహరి, పీఏసీఎస్ చైర్మన్ దేవేందర్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు ఆవుల మహేందర్ పాల్గొన్నారు.

మూడోసారి ఆశీర్వదించండి..

హుస్నాబాద్: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అభివృద్ధి కుంటుపడుతుందని రాష్ట్ర టీవీ, చలన చిత్రాభివృద్ధి సంస్థ చైర్మన్, ఎన్నారై బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కుర్మాచలం అనిల్ అన్నారు. పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ఎన్నారై విభాగం ఎన్నికల్లో కాకుండా తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ వెంట ఉండి క్రియాశీలక పాత్ర పోషించిందన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్‌ను రెండుసార్లు ప్రజలు ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించారని.. మూడోసారి ఆశీర్వదించాలని కోరారు. సమావేశంలో ఎన్నారై (యూకే) బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు నవీన్ రెడ్డి, ఎన్నారై (బహరెన్) బీఆర్ఎస్ అధ్యక్షుడు రాధారపు సతీశ్‌కుమార్, ఎన్నారైలు లక్ష్మారెడ్డి, ఇసంపల్లి రమేశ్, మధుయాదవ్, రాజ్‌కుమార్, ప్రవీణ్ పంతులు, దూస గణేశ్ ఉన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం మద్దతు

చిగురుమామిడి: హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్ గెలుపునకు కృషి చేస్తామని మండల విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు తెలిపారు. సోమవారం చిగురుమామిడిలో సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో మండల విశ్వకర్మ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్‌కుమార్, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ రామోజు రజిత, తదితరులు పాల్గొన్నారు